నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, ఆదివారం 30 మార్చి 2025 | HANUMAKONDA



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

అబద్ధపు హామీలతో

రేవంత్ సర్కార్ అభాసుపాలు

- ప్రజా వ్యతిరేక విధానాలతోనే బీఆర్ఎస్ వైపు చూపు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రాయపర్తిలో గులాబీ గూటికి 20మంది కాంగ్రెస్ కార్యకర్తలు

రాయపర్తి, మార్చి 29 : ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగెత్తిపోయి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం రాయపర్తి మండలకేంద్రానికి చెందిన సుమారు 20మంది సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఎన్నికల మ్యానిఫెస్టో, డిక్లరేషన్ల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ గత 15 నెలల పరిపాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నదని విమర్శించారు. గతంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తక్కువ కాలంలోనే కాంగ్రెస్ సర్కారు ప్రజల నుంచి ఛీత్కారాలకు గురవుతూ అభాసుపాలవుతున్నదని చెప్పారు. గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేని రేవంత్‌రెడ్డి.. పరిపాలించే హక్కు కోల్పోయాడని మండిపడ్డారు. ఓ వైపు రైతాంగం సాగు జలాలు లేక, తీవ్రమైన కరెంట్ కోతలతో అల్లాడుతుంటే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేసి అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారన్నారు. అనంతరం పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ ప్రజాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ అశ్రఫ్ అలీ, మండల సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు జలగం రవి, కసిరబోయిన కుమార్, మహ్మద్ ఖముర్రొద్దీన్‌ల సారథ్యంలో 20మంది గులాబీ గూటికి చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, గారె నర్సయ్య లేతాకుల రంగారెడ్డి, అయిత రాంచందర్, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ అక్బర్, ముద్రబోయిన సుధాకర్, చందు రామ్‌యాదవ్, మైస వెంకటేశం, చందు సతీశ్‌యాదవ్, చిన్నాల ఉప్పలయ్య, ఎనగందుల యాదగిరి, అనంతుల కృష్ణారెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, బాషబోయిన సుధాకర్, సంతోష్‌గౌడ్, కసిరబోయిన రాజుయాదవ్, బల్లెం యాదగిరి, యూసఫ్, బండారి అశోక్, ఉబ్బని సింహాద్రి, మధు, బండి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీళ్లిచ్చి పంటలను కాపాడండి..

ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎర్రబెల్లి

రాయపర్తి : వరి చేతికందే దశలో చివరి తడి కోసం వెంటనే సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇరిగేషన్ అధికారులను ఫోన్లో విజ్ఞప్తి చేశారు. శనివారం తన స్వగ్రామం పర్వతగిరి నుంచి రాయపర్తికి వస్తున్న దయాకర్‌రావును మండలంలోని పెర్కవేడులోని ప్రధాన కూడలిలో పలువురు రైతులు, బీఆర్ఎస్ నేతలతో కలసి ఎర్రబెల్లికి తమ గోడు వెల్లబోసుకున్నారు. మండలంలోని రాగన్నగూడెం, పెర్కవేడు, గణేశ్‌కుంట తండా, సూర్యతండా, అవుసులకుంట తండా, కొత్తూరు, బంధన్‌పల్లి, కొండాపురం, గట్టికల్, ఊకల్ తదితర గ్రామాల్లో రైతులు వరి పొలాలన్నీ పొట్ట దశ నుంచి పూర్తిగా ఈనిధాన్యపు గింజలు పాలు పట్టే దశలో ఉన్నట్లు వివరించారు. ఈ క్రమంలో అధికారులు ఎస్సారెస్పీ నీళ్ల విడుదలను నిలిపివేయడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయినట్లు చెప్పారు. చేతికందే దశలో ఉన్న వరి, మక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు నీళ్లు వచ్చేలా చూడాలని ఎర్రబెల్లికి విజ్ఞప్తి చేయగా ఆయన వెంటనే ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడుతూ రైతుల గోడును వివరించి సాగు కోసం జలాలు విడుదల చేయాలని కోరారు.

ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

- సర్కారు నిర్లక్ష్యంతో రూ.600 కోట్ల పంట నష్టం
- బీఆర్ఎస్ సభకు జాతరలా తరలిరావాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- 91మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నీళ్లివ్వకుండా రైతుల మధ్య చిచ్చు

జనగామ, మార్చి 29(నమస్తే తెలంగాణ) : దేవాదుల పంపులు సకాలంలో ఆన్‌చేసి నీళ్లివ్వకుండా ప్రభుత్వం గ్రామాల మధ్య కొట్లాట.. రైతుల మధ్య చిచ్చుపెట్టిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. లెఫ్ట్ కెనాల్ ఇప్పితే.. రైట్ కెనాల్ వాళ్లు కొట్లాడుతున్నారని, రిజర్వాయర్ నుంచి నీళ్లు తరలిస్తే ఆయకట్టు రైతులు గొడవ పడుతున్నారని, కాంగ్రెస్ నిర్వాకం వల్ల ఊళ్లు, మండలాల మధ్య కొట్లాట జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జనగామ నియోజకవర్గంలోని 91 మంది లబ్ధిదారులకు రూ.26.48 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ నీళ్లు మంచిగ ఉంటే ఈ సమస్య రాదని.. నీళ్లివ్వకుండా ప్రజలు, రైతుల మధ్య కొట్లాట పెట్టిందన్నారు. బొమ్మకూరు, కన్నెబోయిన గూడెం, వెల్దండ, చీటకోడూరు రిజర్వాయర్ల ద్వారా గతంలో వాటి పరిధిలోని చెరువులు, కుంటలన్నీ నిండాయన్నారు. కేసీఆర్ కట్టిన సమ్మక్క బరాజ్‌లో నడి ఎండాకాలంలోనూ నీళ్లున్నాయని, ధర్మసాగర్, గండిరామారం, బొమ్మకూరు నుంచి ఎత్తిపోసే మోటర్లు ఉన్నాయని.. అన్ని చెరువులకు కావాల్సినన్ని నీళ్లున్నా.. వాటిని తీసుకొచ్చే తెలివి కాంగ్రెస్ పాలకులకు లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో 34 రోజులు మెయింటనెన్స్ సంస్థకు రూ. 6 కోట్లు విడుదల చేయని ఫలితంగా రూ.600 కోట్ల మేర రైతులకు నష్టం జరిగిందని ధ్వజమెత్తారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ప్రభుత్వంతో కొట్లాడితే ఆలస్యంగా పంపులు ఆన్ చేశారని, అవి కూడా మూడు రోజులకే ఆగిపోయాయని మండిపడ్డారు. రెండు నెలల్లో 40 రోజులు పంపులు అసలే పనిచేయలేదని.. ఇంత అన్యాయంగా గతంలో ఏ ప్రభుత్వమూ వ్యవహరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా అన్నారు ఏమైంది? రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదని.. కేసీఆర్ హయాంలో 11సార్లు పెట్టుబడి సాయం పడలేదా? రైతుబంధు, రైతు బీమా అందరికీ కడుపునిండా ఇవ్వలేదా? గింజ కూడా మిగలకుండా వడ్లు కొనలేదా అని ప్రశ్నించారు.

అసెంబ్లీలో ఇదే సవాల్ చేశానని, జనగామ నియోజవకర్గంలోని 128 గ్రామాల్లో ఎక్కడైనా 100 శాతం రుణమాఫీ అయిందని చెబితే ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తానని చాలెంజ్ చేశానని చెప్పారు. పచ్చి అబద్ధాలు.. మోసపూరిత మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఒక్క బస్సు ఫ్రీ మినహా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని లెక్కలతో సహా అసెంబ్లీలో కడిగిపారేశామన్నారు. అసెంబ్లీలో జీరో అవర్.. క్వశ్చన్ అవర్‌లో మాట్లాడేందుకు ఎప్పుడు అవకాశం వచ్చినా జనగామ ప్రాంత సమస్యలను ప్రస్తావించి సాధ్యమైనంత వరకు ప్రజలకు మేలు చేసే పనులను ప్రభుత్వం దృష్టికి తెచ్చానని అన్నారు. గానుగుపహాడ్ బ్రిడ్జి, చీటకోడూరు బ్రిడ్జి, సీటీ స్కానింగ్, చేర్యాలకు రెవెన్యూ డివిజన్ అంశాలను ప్రస్తావించానని, మూడు సార్లు చెప్పగా, చెప్పగా జనగామ దవాఖానకు సీటీస్కాన్ పంపారని ఎమ్మెల్యే పల్లా గుర్తుచేశారు.

బీఆర్ఎస్ సభకు జాతరలా కదలిరావాలి..

కొమురవెల్లి, ఐనవోలు, కొత్తకొండ, సమ్మక్క సారలమ్మ జాతరకు పోయినట్టు ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊళ్లకు ఊళ్లు కదలిరావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 15 నెలల కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టేందుకు తరలివచ్చి కేసీఆర్‌ను మాటలు విని స్ఫూర్తి పొంది మళ్లీ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. చెరువులు నిండాలన్నా.. కష్టాలు పోవాలన్నా ఉద్యమస్ఫూర్తితో కదంతొక్కాలన్నారు. సభకు వెళ్లేందుకు గ్రామాల్లో చర్చించుకొని ఏ వాహనం దొరికితే ఆ వాహనంలో రావాలని పల్లా కోరారు. మాజీ మార్కెట్ చైర్మన్ బాల్లె సిద్ధిలింగం, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు పోకల జమున, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు శారద, బీఆర్ఎస్ నాయకులు బండ యాదగిరిరెడ్డి, ఇర్రి రమణారెడ్డి, వీ శ్రీనివాస్‌రెడ్డి, భూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, రాజు, యాదగిరిగౌడ్, రేఖ, ఎడ్ల రాజు పాల్గొన్నారు.

పల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

తరిగొప్పుల, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జనగామలోని క్యాంప్ కార్యాలయంలో తరిగొప్పల మండలంలోని జాల్‌బాయ్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పింగిలి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారిలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సభావత్ రమేశ్, శ్రీనివాస్, భూక్యా తిరుపతి, జరుపుల రాములు, రాజు, భీముడు, కోడవత్ తిరుపతి, పరమేశ్, సూర్య, పూల్యా, ఈర్య, సంతోష్, గణేశ్, దాస్య తదితరులున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూక్యా జూంలాల్ నాయక్, తాళ్లపల్లి పోషయ్య, మాజీ సర్పంచ్ రాజు, ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొండ కుమార్ తదితరులున్నారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా

నేడు ఉగాది

- సందడిగా మారిన నగరం

శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. శనివారం పండుగకు కావాల్సిన మామిడి కాయలు, ఆకులు, వేప పూవు, పచ్చడి కుండలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో నగరంలోని హనుమకొండ చౌరస్తా, టైలర్స్ స్ట్రీట్ సందడిగా మారి కిక్కిరిసిపోయాయి.

– హనుమకొండ చౌరస్తా, మార్చి 29